సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం ; 18 ; మార్చి ; 2023



గుండెకు భరోసానిద్దాం!
ప్రస్తుతం గుండెపోటుతో మృతిచెందేవారు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

వివరాలు IIలో ▸



ఫెయిల్యూరు ప్రాజెక్టు
చిన్నోనిపల్లె రిజర్వాయర్ ఫెయిల్యూర్ ప్రాజెక్టు అని మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /21.3

వాతావరణం
ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. చిన్నపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

అపార నష్టం

అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం



క్యాతూర్ గ్రామంలో తడిసిన పప్పుశనగ కుప్పలను సరి చేస్తున్న రైతులు

- కొనుగోలు కేంద్రాల్లో, కల్లాల్లోని వేరుశనగ, మిర్చి, పప్పుశనగ పంటకు భారీ నష్టం
- గన్నీబ్యాగులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచని అధికారులు
- అష్టకష్టాలు పడుతున్న రైతులు

అలంపూర్/ఉండవెల్లి/మానవపాడు/గట్టు: అకాల వర్షానికి జిల్లాలో అన్నదాతలకు అపారనష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు మార్కెట్లకు తీసుకురాగా ఒక్కసారిగా కురిసిన వర్షాలకు తడిసి ముద్దయ్యింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా వేరుశనగ, మిర్చి, పప్పుశనగ తడిసిపోయింది. గద్వాల మార్కెట్, అలంపూర్‌లో పప్పుశనగ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు తీసుకొచ్చిన ధాన్యం వర్షార్పణమైంది. గద్వాలలో ధాన్యం రైతుల కళ్లముందే కొట్టుకుపోతుంటే కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. అలంపూర్ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో విక్రయించేందుకు పంట పొలాల్లోని కల్లాల్లో మిర్చి తడిసిపోయింది. రాసులుగా పోసిన మిర్చి కింది నుంచి నీళ్లు వచ్చి కొట్టుకుపోయింది.

స్థలం లేక పంటపొలంలో..

అలంపూర్ మండలం క్యాతూర్ పీఏసీఎస్ అధికారులు పప్పుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. స్థానికంగా కార్యాలయం వద్ద స్థలం లేకపోవటంతో గ్రామసమీపంలోని ఓ రైతు పంటపొలంలో చుట్టుపక్కల గ్రామాల రైతులు విక్రయించేందుకు ధాన్యం రాసులు పోసుకున్నారు. 15 రోజులుగా పప్పుశనగ ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో అకాల వర్షానికి తడిసిపోయింది. అధికారులు నిర్లక్ష్యంగా కనీసం గన్నీబ్యాగులు కూడా ఇవ్వలేదని తక్కశీల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతులకు ఇక్కడ మార్కెట్, గోదాంలు లేకపోవటంతో ఏళ్ల తరబడి పండించిన పంటను అమ్ముకునేందుకు తమ పంటపొలాల్లోనే రాసులుగా పోసుకున్నారు. అకాల వర్షంతో మిర్చి రాసులు మొత్తం తడిసిపోయాయి. గద్వాల జిల్లాలో ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు 11 మంది రైతులకు చెందిన 35 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 10 ఎకరాలు మినుములు, 8 ఎకరాలు చెరుకు, ఎండు మిర్చి 10 ఎకరాలు, మునగ 7 ఎకరాలు ఉంది. తడిసిన ధాన్యంతో అనేక మంది రైతులు నష్టాలపాలయ్యారు.

➡ మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రాత్రి 13.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ యాదగిరి శుక్రవారం తెలియజేశారు. వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా ముందుస్తుగా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిర్చి పంటను తెంచిన రైతులు కల్లాల్లో పంట తడిసిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

➡ ఉండవెల్లిలో విద్యుత్ స్తంభాలు, హరితహారం మొక్కలు, వృక్షాలు నేలకొరిగాయి. మండలంలో 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు. మొక్కజొన్న పంట దాదాపు 15 ఎకరాల్లో నేలమట్టమైంది. పప్పుశనగ పంట కోసి పెట్టడంతో తడిసి నేలపాలైంది. మారమునగాలలో ఎకరన్నర మునగపంట వర్షానికి విరిగిపోయి దెబ్బతిందని మండల వ్యవసాయ అధికారి సురేఖ తెలియజేశారు. ఉండవెల్లి ఫీడర్‌లో 5 విద్యుత్ స్తంభాలు, కంచుపాడు ఫీడర్‌లో 3 స్తంభాలు నేలకొరిగాయి.



చెన్నిపాడులో తడిసిన మిర్చి పంటను సరిచేస్తున్న రైతు కూలీలు

పంట నాశనం



అకాల వర్షంతో మునగ పంట మొక్కలు విరిగి నేల కొరిగి దెబ్బతింది. పిచికారీ చేసి కూలీలతో కలుపు తీసేందుకుకే దాదాపు రూ.లక్ష ఖర్చు వచ్చింది. పంట పూర్తిగా దెబ్బతినడంతో మొత్తం రూ.1.50 లక్షలకు పైగా నష్టమొచ్చింది. వ్యవసాయ అధికారులు కూడా పరిశీలించారు. నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలి.

– తెలుగు ఆంజనేయులు, రైతు, మారమునగాల-1

➡ గట్టులో పొగాకు రైతులతో పాటు మామిడి రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం పొగాకు పంట చేతికందగా.. ఆకులను తోరణాలుగా పేర్చి పొలాల్లో ఆరబెట్టుకున్నారు. ఆరుబయట ఆరబెట్టిన పొగాకు అకాల వర్షం కారణంగా దెబ్బతింది.



గట్టు శివారులో వర్షానికి తడిసిన పొగాకును ఆరబెట్టుకున్న రైతులు

నమోదు కొంతే..!

రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి ఆయుష్మాన్ భారత్ వర్తింపు



గద్వాలలో ఇంటింటికి వెళ్లి ఆయుష్మాన్ భారత్‌లో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

- ప్రచారం చేపట్టని అధికారులు
- గ్రామీణులకు అవగాహన కరువు
- సమాచారం లేక ముందుకురాని ప్రజలు
- మందకొడిగా ఈకేవైసీ ప్రక్రియ

జిల్లాలో తెల్లరేషన్ కార్డులు
1,60,287

ఆయుష్మాన్ భారత్‌లో **64,904**
మందికి మాత్రమే కార్డులు

గద్వాల: ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కింద నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం పొందే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద రూ.2 లక్షల వరకే వైద్య ఖర్చులు చెల్లించేవారు. ఈ రెండు పథకాల విలీనంతో అదనంగా మరో రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలో ఆరోగ్యమిత్ర, ఆరోగ్యశ్రీలతో పాటు సీఎస్‌సీ, స్మార్ట్‌ఐడీ వంటి ప్రైవేటు ఏజెన్సీలకు అవకాశం కల్పించారు. వచ్చే నెలలో కార్డుల జారీకి చర్యలు చేపడుతున్నారు.

ఎక్కడైనా ఉచితంగా సేవలు..

ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే రాష్ట్రంతో పాటు దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఉచిత వైద్య సేవలు పొందడానికి అవకాశం ఉంది. కుటుంబంలో ప్రతిఒక్కరికి వేర్వేరుగా ప్రత్యేక కార్డులు జారీ చేస్తారు. పలు రకాల వ్యాధులకు చికిత్స అందిస్తారు. ప్రధానంగా గుండె, కాలేయ, మోకాలి చిప్ప మార్పిడి తదితర శస్త్రచికిత్సలు చేయించుకోవచ్చు. వ్యక్తి తప్పనిసరిగా శిబిరం వద్దకు వెళ్తే ఫొటో తీసుకుని వివరాలు నమోదు చేసుకుంటారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా వివరాలు సమర్పించవచ్చు. దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో, ఆరోగ్య మిత్ర, ఏఎన్‌ఎంల వద్దకు వెళ్తే... ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ చెబితే చాలు నమోదు చేస్తారు.

ప్రతిఒక్కరికి పథకం వర్తించేలా..

ఆహార భద్రత కార్డు (రేషన్‌కార్డు) కలిగిన ప్రతిఒక్కరికి ఈ పథకం వర్తించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. క్షేత్రస్థాయిలో ఆరోగ్యమిత్ర, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో పాటు ప్రైవేటు ఏజెన్సీలు ఈ ప్రక్రియను పూర్తిచేస్తున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరూ వివరాలు సమర్పించి అనుసంధానం చేసుకోవాలి. తద్వారా రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య ఖర్చులు పొందే అవకాశం ఉంటుంది.

– సిద్దప్ప, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, గద్వాల

కనిపించని శిబిరాలు..

ఈ పథకంపై ఏఎన్‌ఎం, ఆరోగ్యమిత్ర, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. వారు ఆయా గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తూ.. వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఆయితే ఎక్కడ కూడా శిబిరాలు కనిపించడం లేదు. ఈ పథకంపై ప్రచారం కూడా కరువైంది. దీంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకంపై గ్రామీణులకు కనీస అవగాహన లేదు. చాలామంది పేదలు ఈ పథకం నమోదుకు దూరమవుతున్నారు. ప్రైవేటు ఏజెన్సీలు సైతం ప్రజల నుంచి వివరాలు నమోదు చేయడం లేదు. అయితే కొంతమంది రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వారివారి ప్రాంతాల్లో ప్రైవేటు ఏజెన్సీలతో కలిసి పథకం కోసం వివరాలను నమోదు చేయిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఎక్కడికక్కడ సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. తెల్లరేషన్ కార్డుతో అనుసంధానం చేస్తున్నారు. జిల్లాలో అంతంత మాత్రమే ప్రజలకు తెలియడంతో, వారు వెళ్లకపోవడంతో ఆయా గ్రామాలు, వార్డుల్లో స్వచ్ఛందంగా వివరాలు సమర్పించడానికి ప్రజలు ముందుకు రావడం లేదు. నమోదు ప్రక్రియ ఇప్పటి వరకు 20 శాతం కూడా పూర్తి కాలేదు. జిల్లాలో 1,60,287 తెల్లరేషన్ కార్డులు ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 64,904 మంది మాత్రమే ఆయుష్మాన్ భారత్‌లో నమోదు ఆయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పిస్తేనే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



మల్దకల్: మండలంలోని పాల్వాయిలో శుక్రవారం శ్రీసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ పునర్ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ధ్వజస్తంభంతో పాటు, నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది.

సద్దలోనిపల్లిలో..

మండలంలోని సద్దలోనిపల్లిలో శుక్రవారం కృష్ణస్వామి ఆలయ శిఖర, బొడ్రాయి ప్రతిష్ఠాపనను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు సత్యప్రమోదచార్యులు, శ్రీపతి, శ్రావణ్‌కుమార్, పాండురంగాస్వామి బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠాపన చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సర్పంచ్ అశోక్ ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాల్వాయి, సద్దలోనిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వేర్వేరుగా ఆలయాలకు చేరుకుని ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, శివరామిరెడ్డి, అశోక్, పెద్దవీరన్న, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో మానికానందన్ మహారాజ్



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శుక్రవారం మానికానందన్ మహారాజ్ దర్శించుకున్నారు. స్వామివారు తమిళనాడులోని తిరుచ్చి నుంచి వచ్చినట్లు ఆలయ జూనియర్ అసిస్టెంట్ చంద్రయ్య ఆచారి తెలిపారు. అఘోర పరంపరలో భాగమైన ఈ స్వాములవారు ఇక్కడి శక్తిపీఠాన్ని దర్శించుకునేందుకు రాగా.. దేవస్థానం తరపున వారికి తగు గౌరవమర్యాదలు అందించి, ఆలయ విశిష్టతను వివరించారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ గురుకులాల్లో ఐదో తరగతిలో చేరేందుకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువును ఈనెల 20వ తేదీ వరకు పెంచినట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రాంతీయ సమన్వయ అధికారి కె.నాగార్జునరావు, రంగారెడ్డిగూడెంలోని జూనియర్ కాలేజీ (బాలికల) ప్రిన్సిపాల్ వాణిశ్రీ వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 23న నిర్వహించనున్నామన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలను https://tscet.cgg.gov.in లేదా https://tswgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లలో చూడవచ్చని తెలిపారు.

నేడు ప్రత్యేక బ్యాంకు లోక్ అదాలత్

పాలమూరు: బ్యాంకులలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం శనివారం ప్రత్యేక బ్యాంకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమావతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక బ్యాంకు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు నిర్వాహకులతో పాటు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు సంబంధించి 779 కేసులలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

రాజీవ్ స్వగృహ ప్లాట్ల విక్రయం

- 54కు గాను 43 విక్రయం
- రూ.8.85 కోట్ల ఆదాయం



వేలందారులకు ఆర్డర్ కాపీలు అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: రాజీవ్ స్వగృహ కాలనీ(అంబర్ టౌన్‌షిప్)లోని 54 ప్లాట్లకు కలెక్టర్ నేతృత్వంలో స్థానిక హరితహోటల్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వేలందారులు 54 ప్లాట్లకు గాను 43 ప్లాట్లను దక్కించుకున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. వేలంలో పాల్గొన్న వేలందారులు స్క్వేర్ ఫీట్‌కు గరిష్టంగా రూ.11,500, కనిష్టంగా రూ.5,600 చొప్పున వేలం జరిగిందన్నారు. దీని ద్వారా మొత్తం రూ.8.85 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. బహిరంగ వేలంలో ప్లాట్లు దక్కించుకున్న వేలందారులకు ప్లాట్ల ఆర్డర్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజు, డీపీఓ శ్యాం సుందర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ @ రూ.7,540

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,540, కనిష్ఠంగా రూ.5,370 ధరలు లభించాయి. మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,178, కనిష్ఠంగా రూ.1,839, పెబ్బర్లు గరిష్ఠంగా రూ.4,789, కనిష్ఠంగా రూ.2,839, కందులు రూ.7,743, ఆముదాలు గరిష్ఠంగా రూ.6,460, కనిష్ఠంగా రూ.6,199, హంసకు రూ.1,629 ధర లభించింది.

ఇంటర్ పరీక్షలకు 221 మంది గైర్హాజరు

గద్వాల: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని అధికారులు ముందుస్తుగా తెలియజేయడంతో విద్యార్థులు దాదాపు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఇంగ్లిష్ పరీక్షకు మొత్తం 4,399 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 4,178 మంది విద్యార్థులు హాజరయ్యారు. 221 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ జనరల్ విభాగంలో 3,672 మంది విద్యార్థులకు గాను 3,496 మంది విద్యార్థులు హాజరు కాగా.. ఒకేషనల్ విభాగంలో 727 మంది విద్యార్థులకు గాను 682 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్యా జిల్లా అధికారి హృదయరాజు తనిఖీ చేశారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు 144 సెక్షన్‌ను ఆయా కేంద్రాల వద్ద అమలు చేశారు.



గద్వాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న హృదయరాజు

బీజేపీకి బూస్ట్..!

ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డి విజయం

- పాలమూరుపై ప్రత్యేక ఫోకస్
- ఫలించిన ముఖ్యనేతల కృషి, ప్రచారం
- పక్కా వ్యూహంతో ఆత్మీయ సమ్మేళనాలు
- ప్రచారాస్త్రాలుగా 317 జీఓ, బదిలీలు, ప్రమోషన్లు, సీపీఎస్
- గెలుపుతో 'కమలం' శ్రేణుల్లో నూతనోత్సాహం



అలంపూర్‌లో విజయ చిహ్నం చూపిస్తున్న తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నాయకులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. పార్టీశ్రేణులు జెండాలు చేతబూని పలు సెంటర్లలో ప్రదర్శనలు నిర్వహించారు. స్వీట్లు పంచి బాణసంచా కాల్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కమల దళంలో ఈ గెలుపు జోష్ నింపింది. అంతేకాదు.. పాలమూరుపై పార్టీ నాయకత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిన నేపథ్యంలో ఈ విజయం బూస్టు వంటిదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పక్కా వ్యూహంతో..

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధిక సీట్లు గెలిచి.. అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ అధినాయకత్వం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ ప్రజలకు చేరువయ్యేలా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో బరిలో నిలిచిన ఏవీఎన్ రెడ్డి గెలుపు కోసం ఆ పార్టీకి చెందిన కీలక నేతలు ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ప్రధానంగా కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ తదితరులు ప్రచారం చేశారు. ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ప్రతి 25మంది ఉపాధ్యాయ ఓటర్లకు ఒకరు చొప్పున కీలక నేతలకు బాధ్యతలు అప్పగించి.. సమన్వయంతో అన్నీ చక్కదిద్దుకుంటూ రూపొందించుకున్న ప్లాన్‌ను పక్కాగా అమలు చేశారు.

మీ తీర్పుపైనే భవిష్యత్ అంటూ..

ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన బీజేపీ నేతలు ముఖ్యంగా ఉపాధ్యాయ సమస్యలను లేవనెత్తి.. వాటి పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎండగట్టారు. ప్రధానంగా 317 జీఓతో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న కష్టాలు.. దీనిపై బీజేపీ ఉద్యమించిన తీరును వివరించారు. తమ పోరాటంతోనే ఉపాధ్యాయ వర్గానికి కొంతమేలు జరిగిందనే విషయాన్ని నొక్కి చెప్పారు. సీపీఎస్ విధానం, పీఆర్సీ, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, పాఠశాలల్లోని సమస్యలు ఇలా ప్రతి అంశాన్ని ప్రస్తావించి ఉపాధ్యాయులను ఆకర్షించారు. మేధావులైన ఉపాధ్యాయ, అధ్యాపకుల తీర్పుపైనే తెలంగాణ భవిష్యత్ ఆధారపడిందని చెప్పి వారిని ఆలోచింపజేశారు. మిగిలిన అభ్యర్థులు ఎవరు గెలిచినా.. వారు అధికార పార్టీలో చేరుతారంటూ గతంలో చోటుచేసుకున్న ఘటనలను సైతం ఉదహరించారు. ఈ విధంగా ఏవీఎన్ రెడ్డి విజయం కోసం బీజేపీ నేతలు రూపొందించుకున్న ప్రణాళికను పకడ్బందీగా అమలు చేసి గెలుపును సొంతం చేసుకున్నారు.

సంగ్రామయాత్రతో మొదలు..

గతంలో బీజేపీకి పాలమూరులో కొంతమేర పట్టుంది. అలంపూర్ నుంచి రావుల రవీంద్రనాథ్ రెడ్డి బీజేపీ తరఫున మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. 1999లో మహబూబ్‌నగర్ ఎంపీగా జితేందర్‌రెడ్డి గెలుపొందారు. 2012 ఉపఎన్నికల్లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. అయితే తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014, 2018 ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పలేదు. ఈ రెండు పర్యాయాలు ఆచారి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసిన డీకే అరుణ గెలవలేకపోయినా.. అధికార టీఆర్ఎస్ పార్టీకి ముచ్చెమటలు పట్టించారు. అదేవిధంగా నారాయణపేట, మక్తల్, కల్వకుర్తి, మహబూబ్‌నగర్ సెగ్మెంట్లతోపాటు పలు పట్టణాల్లో పార్టీకి ఓటు బ్యాంకు ఉన్నా.. వరుస ఓటములతో శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. అయితే గతేడాదిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన రెండో విడత ప్రజాసంగ్రామ యాత్ర విజయవంతం కావడం వారిలో ఆశలు రేపింది. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఇక్కడే రెండు రోజులపాటు నిర్వహించడంతో జోష్ పెరిగింది. ప్రజాగోస–బీజేపీ భరోసా పేరిట పార్టీ కార్యక్రమాలు ఊపందుకోవడం, మహబూబ్‌నగర్ లోక్‌సభ నుంచి అమిత్‌షా పోటీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతుండడంతో బీజేపీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. తాజాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ మద్దతిచ్చిన ఏవీఎన్ రెడ్డి గెలుపొందడం వారిలో మరింత ఉత్తేజం నింపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

పిడుగు పాటుకు రైతు మృతి


సహదేవుడు (ఫైల్)

పాన్‌గల్: పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని చిక్కేపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కేపల్లికి చెందిన రైతు ముంత సహదేవుడు(33) తన పొలంలో సాగు చేసిన వరి పంటకు నీరు పెట్టేందుకు గురువారం రాత్రి వెళ్లాడు. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పడటంతో పంట పొలంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు శుక్రవారం పొలం దగ్గరికి వెళ్లి చూడగా, మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి..

అడ్డాకుల: మండలంలోని రాచాలలో చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విజయ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీనివాసులు(42), వెంకటేశ్వరమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసైన శ్రీనివాసులు భార్య, పిల్లలను పట్టించుకోకుండా తిరిగే వాడు. ఈక్రమంలో భర్తను పలుమార్లు భార్య మందలించినా తీరు మార్చుకోలేదు. దీంతో ఏడాది క్రితం ముగ్గురు పిల్లలను తీసుకుని వెంకటేశ్వరమ్మ తన తల్లిగారి ఊరైన మల్కాపురం వెళ్లిపోయింది. అప్పటి నుంచి శ్రీనివాసులు ఏ పని చేయకుండా ఊర్లో తిరిగేవాడు. ఈక్రమంలో అప్పుడప్పుడు పెద్ద చెరువులో చేపలు పట్టి విక్రయించేవాడు. మంగళవారం కూడా చేపల కోసం చెరువు వద్దకు వెళ్లాడు. అనుకోకుండా నీటిలో మునిగిపోయాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శ్రీనివాసులు ఎక్కడికి పోయాడన్న దాని గురించి పట్టించుకోలేదు. శుక్రవారం పెద్ద చెరువులో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. బంధువులు శ్రీనివాసులుగా గుర్తించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు దుర్మరణం



దేవరకద్ర రూరల్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గోపన్‌పల్లి సమీపంలో రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని యువకుడు (28) వ్యక్తి ప్లాస్టిక్ వస్తువులు సేకరిస్తున్న క్రమంలో రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా, మృతుడి వివరాలు లభించలేదని గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9848402339 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం


మక్తల్: ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పట్టణంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన కుమ్మరి వెంకటేష్ (53) మూడేళ్ల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఏళ్ల నుంచి ఆస్పత్రులకు చూపించినా నయం కాలేదు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసి పొలానికి వెళ్తానని ఇంట్లో చెప్పాడు. కాగా వ్యవసాయ పొలం వద్ద వేప చెట్టుకు ఉరేసుకుంటున్నట్లు తమ్ముడు ఆనంద్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ఆనంద్ గద్వాలకు వెళ్లడంతో ఇంట్లో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసేసరికి మృతి చెందాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

జేపీఎన్‌సీఈలో ముగిసిన వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రానికి సమీపంలోని జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (జేపీఎన్‌సీఈ)లో సీఎస్ఈ, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఒరాకిల్, జావా ఫండమెంటల్స్‌పై నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఐదు రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నిపుణలతో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కాగా, దీని ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ. సుజీవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.గురురాఘవేంద్రారెడ్డి, శిక్షకులు ఎం.ప్రణయ్, కో–ఆర్డినేటర్ ఎ.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



గుండెకు భరోసానిద్దాం!



- ముందస్తు జాగ్రత్తలు, సీపీఆర్‌తో బయటపడే అవకాశం
- మారుతున్న జీవనశైలితోనే ముప్పు

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రామయ్యబౌళికి చెందిన సయ్యద్ మజిద్ హుస్సేన్ అలియాస్ జునేద్ (26) గురువారం రాత్రి జిమ్‌లో కొంత సేపు వ్యాయామం చేశాడు. అక్కడి నుంచి స్నూకర్ ఆడడానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. రాత్రి 11:30 గంటల సమయంలో వాంతులు చేసుకొని కుప్పకూలి పోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కరోనా తర్వాత పోస్ట్‌కోవిడ్ సోకిన బాధితులతో పాటు ఇతరులకు సైతం ఇటీవల గుండెపోటు పెరిగాయి. సడెన్ కార్డియాక్ ద్వారా పలువురు మృతి చెందడం ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో గుండె జబ్బులతో రోగులు బారులు తీరుతున్నారు.


జునేద్ (ఫైల్)


సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్య సిబ్బంది

ముందస్తుగా గుర్తించడం ఎలా?

సాధారణంగా గుండెపోటు వచ్చే వాళ్లకు కొన్ని లక్షణాలు కన్పిస్తుంటాయి. ప్రధానంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఊపిరాడక పోవడం, గుండె బరువు అనిపించడం, నీరసం, చెమటలు రావడం, చేతులు లాగడం వంటివి అనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. ముందస్తు చికిత్స తీసుకుంటే కార్డియాక్ అరెస్టు నుంచి బయటపడేందుకు అవకాశం ఉంది.

దెబ్బకొడుతున్న జీవన శైలి

గతంతో పోలిస్తే ప్రస్తుతం అన్ని వర్గాల వ్యక్తులు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఉదయం లేచింది మొదలు ఉరుకుల పరుగుల జీవనం తప్పడం లేదు. సరైన ప్రణాళిక లేక వృత్తి, వ్యక్తిగత జీవితంలో ఒత్తిడితో సతమతం అవుతున్న పరిస్థితి ఉంది. కొన్ని రకాల ఉద్యోగాల్లో లక్ష్యాలు ఉంటాయి. అందుకోవడానికి పరుగులు పెట్టాల్సిందే. వేళకు తిండి తినరు. తిన్నా జంక్‌ఫుడ్ అలవాటు పడుతున్నారు. కొందరైతే చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారు. చివరికి తీవ్ర అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. చిన్న వయస్సులోనే హృద్రోగ ముప్పు తలెత్తుతోంది. వారంలో 4–5రోజులు బయటే తింటున్నారు. ఈ ఆహారంలో రుచికోసం అధిక మసాలాలు, నూనెలు వాడుతుంటారు. తరచూ ఇవి తినడంతో అధిక కేలరీలు శరీరంలోకి చేరుతాయి. అందుకు తగినట్లు వ్యాయామం లేకపోవడంతో ఊబకాయులుగా మారి చివరకు ఆ ప్రభావం గుండెపై చూపుతుంది.

అన్ని శాఖలలో శిక్షణ



ఇటీవల సడెన్ కార్డియాక్‌తో పాటు సీపీఆర్ విధానంపై రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన ఐదుగురు మెడికల్ ఆఫీసర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వారి నుంచి మొదట ఆరోగ్య శాఖలో ఉన్న ప్రతి ఉద్యోగికి శిక్షణ ఇచ్చి ఆ తర్వాత ప్రభుత్వ శాఖలో ఉన్న అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇస్తాం. జిల్లాకు ఏఈడీ మిషన్లతో పాటు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ప్రారంభం చేస్తాం.

– కృష్ణ, డీఎంహెచ్ఓ, మహబూబ్‌నగర్

ఎత్తుకు సరిపడ బరువు ఉండాలి



ఎక్కువగా ఒత్తిడి, ఆహార అలవాట్లలో మటన్, బేకరీ ఫుడ్, స్ట్రీట్‌ఫుడ్‌లో బజ్జీలు తినరాదు. ఒకేరకం నూనెలో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. జిమ్‌లో కూడా ఎక్కువ బరువులు లేపకపోవడంతో అధిక ప్రొటీన్ ఉన్న ఆహారం తీసుకోరాదు. సిగరేట్, మందు తగ్గించాలి. నేడు మారిన జీవన శైలి వల్ల 20ఏళ్ల వయసు యువకుల దగ్గర నుంచి 70ఏళ్ల వృద్ధుల వరకు గుండెపోటు వస్తుంది. ధూమపానం, మద్యం, చిన్న వయస్సులో షుగర్ రావడం, బీపీ, ఫాస్ట్‌ఫుడ్, లావు పెరగడం, చెడు కొలాస్ట్రాల్ వల్ల గుండె పోటుకు దారితీస్తున్నాయి.

–డాక్టర్ భరత్, కార్డియాలజిస్ట్

ఏఈడీ యంత్రాలు అవసరం

జన సంచారం అధికంగా ఉండే రైల్వే, బస్టాండ్స్, పార్కులు, మాల్స్, అపార్ట్‌మెంట్లలో ఆటోమేటిడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఏఈడీ) మిషన్లు ప్రభుత్వం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. గుండె లయ మార్చడంలో భాగంగా వెంటనే కరెంట్ షాక్ ఇవ్వడానికి ఈ మిషన్ ఉపయోగపడుతుంది.

సడెన్ కార్డియాక్ అరెస్టు అంటే..

సడెన్ కార్డియాక్ అరెస్టు అంటే ఆకస్మికంగా గుండె ఆగిపోవడం, ప్రాణహానికి దారి తీసే అత్యవసర పరిస్థితి. ఏటా ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది సడెన్ కార్డియాక్ అరెస్టు వలన వైద్య సహాయం లేని ప్రదేశాలు, ఆస్పత్రి వెలుపల మరణిస్తున్నారు. గుండెకు సరఫరా చేసే రక్త నాళాలలో అంతరాయం వలన గుండె పోటు వస్తుంది. గుండె కండరానికి రక్తం సరఫరా ఆగిపోవడం వల్ల కండరం తొందరగా చచ్చుబడి గుండెపోటు వచ్చి సడెన్ కార్డియాక్ అరెస్టుకు, మరణానికి దారి తీస్తుంది.

ఇలా చేయండి..

అత్యవసర పరిస్థితుల్లో శ్వాస తీసుకోవడం, గుండె కొట్టుకోవడంలో సమస్య వచ్చినప్పుడు ప్రాణాలను రక్షించే టెక్నిక్. రెండు చేతుల ద్వారా ఛాతిని కుదింపులో వేగంగా చేయడం ద్వారా గుండె పునర్జీవం పొందేలా చేయ డాన్ని కార్డియో పల్మొనరీ రిససిటేషన్ (సీపీఆర్) అంటారు. ఇలా చేయడం అందరికీ వచ్చినట్లయితే చాలా మంది ప్రాణాలను కాపాడుకోవచ్చు. సడెన్ కార్డియాక్ అరెస్టు అయిన బాధితున్ని ఒక గట్టి ఉపరితలంపై పడుకోబెట్టాలి. వెంటనే సీపీఆర్ చేయడానికి ముందు బాధితుడి నోటిపై చేతిరుమాలు కప్పాలి. రెండు చేతులతో సీపీఆర్ మొదలు పెట్టి, అతి బలంగా అతివేగంగా ఛాతి మధ్యలో చేతులతో నిమిషానికి 100నుంచి 120సార్లు వేగంగా మర్దన చేయాలి. ఛాతి మర్దన సమయంలో ఛాతి పూర్తిగా యథాస్థానానికి రావాలి. పెద్దవారికి కనీసం రెండు అంగుళాలు (5 సెం.మీ) నుంచి 2.4 అంగుళాలు(6సెం.మీ) లోతు మించకుండా ఛాతీ మర్దన చేయాలి.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు


గాయపడిని విద్యార్థి రిత్విక్

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన రెండవ తరగతి విద్యార్థి రిత్విక్ శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్తుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. విద్యార్థి చేతులతో పాటు పలు చోట్ల గాయాలయ్యాయి. బుధవారం రాత్రి మండలంలో ని తాళ్లపల్లికి చెందిన వెంకటయ్యగౌడ్ ఇంటి ముందు పడుకుని ఉండగా కుక్క వచ్చి దాడి చేసింది. ప్రస్తుతం మండలంలో కుక్కలు వీధుల వెంట దా డులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రా మాలలో కుక్కలను నిర్మూలించాలని కోరుతున్నారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్



జడ్చర్ల: మండలంలోని గంగాపూర్‌లో శుక్రవారం నల్ల చిన్నయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఇంట్లో దాచుకున్న రూ.50వేల నగదుతో పాటు రెండు తులాల బంగారం, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైనట్లు బాధితులు తెలిపారు. సకాలంలో ఫైర్ ఇంజిన్ రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఆలయ అభివృద్ధికి రూ.2.40 కోట్లు మంజూరు


మాట్లాడుతున్న చైర్మన్ ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.2.40 కోట్లు మంజూరయ్యాయి. ఈ విషయంపై ఆలయ చైర్మన్ బెక్కం శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ శుక్రవారం విలేకరులకు తెలిపారు. అతి త్వరలోనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. పుష్కరఘాట్ వద్ద అన్నదానం షెడ్ కోసం వంటశాల, డైనింగ్ హాల్ విరాళం కౌంటర్‌కు నిర్మాణానికి రూ.31 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. హేమలాపురం సదన్ దగ్గర కల్యాణ మండపానికి రూ.42లక్షలు, అందులోనే డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.15 లక్షలు పుష్కరఘాట్‌లోని రేకుల షెడ్‌తో ప్రసాద తయారీ కేంద్రం కోసం స్టోర్ రూం, హాల్ కోసం రూ.15 లక్షలు, హేమలాపుర సదన్‌లో పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కల్యాణ మండపం నిర్మాణం కోసం రూ.15 లక్షలు, శాశ్వత ఆర్చిగేట్ (స్వాగత తోరణాలు)నిర్మాణ పనుల కోసం రూ.50లక్షలులతో కలిపి రూ.1.68కోట్లు కాగా తక్కిన మరి కొన్ని నిర్మాణ పనులకు కలిపి రూ.72 లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు.

మార్కెట్‌కు ఆదాయం పెంచేలా చర్యలు

- రీజినల్ డైరెక్టర్ ఇస్తికర్ నజీబ్


మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ ఇస్తికర్ నజీబ్

కల్వకుర్తి రూరల్: రీజినల్ పరిధిలో మార్కెట్ అధికారులు ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నారని రీజినల్ డైరెక్టర్ ఇస్తికర్ నజీబ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను తనిఖీ చేశారు. మార్కెట్‌లో లావాదేవీలు, ఇతర అంశాలను పరిశీలించారు. సీజన్ ప్రారంభం లేక ఇప్పటి వరకు మార్కెట్‌లో వేరుశనగ క్రయవిక్రయాలపై సమాచారం సేకరించారు. వ్యవసాయ మార్కెట్ ఆదాయం లక్ష్యం రూ.4.80కోట్లు ఉందని, ఇప్పటి వరకు 4.25కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. రాబోయే 15 రోజుల్లో లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రీజినల్ పరిధిలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, బోయిన్‌పల్లి, గడ్డిఅన్నారం, గుడి మల్కాపూర్‌కు మార్కెట్లు ఉన్నాయన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్లను పరిశీలించడంతో పాటు రైతులకు అందుతున్న వసతులు, మార్కెట్ ఆదాయాన్ని చేరుకునే అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఏప్రిల్ చివరి వరకు వేరుశనగ పంట అమ్మకానికి మార్కెట్‌కి వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టే అభివృద్ధి పనులకు నివేదికలు సిద్ధమయ్యాయని, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలన చేశాక బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామన్నారు. ఆయన వెంట మార్కెట్ జిల్లా అధికారి బాలమణి, మార్కెట్ కార్యదర్శి భగవంతు తదితరులు ఉన్నారు.

ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: మన్ననూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మృతి చెందిన నిఖిత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రీ పోస్టుమార్టం చేశారని, ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘటన అయిన మరుసటి రోజే పాఠశాలలో విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి ధైర్యం చెప్పామన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులను మరింత భయభ్రాంతులకు గురి చేయవద్దనే ఉద్దేశంతో వారికి మనోధైర్యాన్ని కల్పించామన్నారు. నిజనిజాలు తేలిన తర్వాత తప్పు చేసినా వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ఘటన ప్రదేశానికి వెళ్లలేదని కొందరు రాద్ధాంతం చేస్తున్నారని, నియోజకవర్గంలో ఎవరికీ అన్యాయం జరిగినా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానన్నారు. ఇలాంటి ఘటన బాధాకరమని, విషయాలు నిగ్గు తేలాక వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. ఇప్పటికే పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయించామని, ఇంకా ఎవరైనా బాధ్యులని తెలిస్తే సర్వీసు నుంచి తొలగిస్తామన్నారు. ఆత్మహత్యలే పరిష్కారం కాదన్నారు. విద్యార్థులు, రైతులు, యువకులు పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, తులసీరాం, రాజేశ్వర్‌రెడ్డి, అమీనొద్దీన్, చెన్నకేశవులు, రమేష్‌రావు, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న చంద్రకళ

ఊట్కూర్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చంద్రకళకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డీజీపీ సందీప్ శాండిల్యా చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందించారు. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వారిలో 75 మందిని ఉత్తమంగా ఎంపిక చేసినట్లు ఇంచార్జ్ ఎస్ఐ అఫ్జల్ తెలిపారు.

ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదు

గద్వాల క్రైం: విద్యార్థిపై దాడి చేసిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షకుర్ తెలిపారు. పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఓ విద్యార్థిపై వ్యక్తిగత ద్వేషం పెంచుకుని ఈ నెల 14వ తేదీన తలపై రాయితో బలంగా కొట్టారు. ఈ దాడిలో ఆ విద్యార్థి మూడు కుట్లు, తీవ్ర గాయాలయ్యాయి. దాడి చేసిన ముగ్గురు విద్యార్థులపై శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం/మిడ్జిల్: భార్యను వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిన కేసులో భర్తకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే మిడ్జిల్ మండలం కంచన్‌పల్లి చెందిన మల్లెపోగు శీనయ్యకు పెద్ద ఆదిరాలకు చెందిన రాములమ్మకు 2001లో వివాహైంది. కొన్ని రోజుల వరకు బాగానే ఉన్నా.. 17ఏళ్లు అవుతున్నా పిల్లలు పుట్టడం లేదని భర్త, అత్త గొడవపడేవారు. ఈ క్రమంలో 2018 అక్టోబర్ 1న మళ్లీ భర్త గొడవ పడడంతో ఆయన ఎదుటే రాములమ్మ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై అప్పటి మిడ్జిల్ ఎస్ఐ రవి కేసు నమోదు చేశారు. ఈ కేసు శుక్రవారం కోర్టుకు రావడంతో మహబూబ్‌నగర్ అసిస్టెంట్ సెషన్‌కోర్టు న్యాయమూర్తి పద్మ శీనయ్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

భర్తపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: అదనపు కట్నం కావాలని వేధిస్తున్న భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. నడింపల్లికి చెందిన మల్లేష్‌తో అచ్చంపేట ఇంద్రానగర్ కాలనీకి చెందిన ఈశ్వరమ్మతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. కొన్ని రోజుల నుంచి భర్తతో పాటు అత్తామామలు అదనపు కట్నం తీసుకరావాలని వేధించారు. శుక్రవారం ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మహిళలు నిద్రిస్తుండగా.. బంగారు గొలుసుల అపహరణ

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో రెండు ఇళ్లలో శుక్రవారం చోరీ జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజమ్మ ఇంట్లో మెడలోని 5 తులాల బంగారు గొలుసు, అదే గ్రామంలో మరో ఇంట్లో యశోద మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చి అలసిపోయి నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మెడలోంచి గొలుసులు దొంగిలించినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'ఫెయిల్యూర్ ప్రాజెక్టు చిన్నోనిపల్లె'


నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

- మాజీ ఐఏసీ అధికారి ఆకునూరి మురళి

గట్టు: చిన్నోనిపల్లె ప్రాజెక్టు ఫెయిల్యూర్ అని ఏ మాత్రం అవగాహన, ఆయకట్టు లేకుండా ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టి రైతులను నిండా ముంచుతున్నారని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆరోపించారు. శుక్రవారం చిన్నోనిపల్లె రిజర్వాయర్ రద్దు కోసం చేస్తున్న ఆందోళన శిబిరాన్ని ఆయనతో పాటు ఎస్‌డీఎఫ్ కో కన్వీనర్ పృథ్వీరాజ్, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్‌కుమార్ సందర్శించి సంఘీభావం తెలియజేశారు. రిజర్వాయర్ ద్వారా ఇక్కడి రైతులకు ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. ఆయకట్టు లేకుండా నిర్మాణం చేపట్టడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. 17 ఏళ్లుగా రిజర్వాయర్‌ను అసంపూర్తిగా వదిలేసినట్లు ఆరోపించారు. అవసరం లేని రిజర్వాయర్‌ను రద్దు చేసి, సేకరించిన భూములను తిరిగి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

జడ్చర్ల: చోరీ కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని కిష్టారంలో గతేడాది సెప్టెంబర్ 20న బాగం నవీన్ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిన 2తులాల బంగారు నగలు, 45తులాల వెండి నగలను ఎత్తుకెళ్లాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నవాబ్‌పేట మండలం దొడ్డిపల్లి చెందిన పిట్టల మల్లేష్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. చోరీ అయిన సొత్తును స్వాధీన పరుచుకున్నట్లు సీఐ తెలిపారు.

సాక్షి బిజినెస్
శనివారం
18-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
355	114
57,990	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,650	▼	66
డోజోన్స్	31,923	▼	323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▼	75
డాక్స్	14,768	▼	199
షాంఘై	3,251	▲	24
నికాయ్	27,334	▲	323

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (24 క్యారెట్)		
58,882	▼	121
బంగారం (22 క్యారెట్)		
58,646	▼	120
వెండి (కేజీ)		
71,576	▼	523

బిస్లెరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
18-2-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20–25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15–20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.

ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రొపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్ఎస్ సిరీస్

హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్ఎస్ 160, ఎన్ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్ఎస్ 200 మోడల్ 18.75 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్ఎస్ 160 మోడల్ 14.6 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.



బిగ్'సి' ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ''ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.



ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.



ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు



ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్ధంలో కనిష్టస్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



రాహుల్

- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



మార్ష్

శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1-5, 2-77, 3-129, 4-139, 5-169, 6-174, 7-184, 8-184, 9-188, 10-188. **బౌలింగ్:** షమీ 6-2-17-3, సిరాజ్ 5.4-1-29-3, పాండ్యా 5-0-29-1, శార్దుల్ 2-0-12-0, జడేజా 9-0-46-2, కుల్దీప్ 8-1-48-1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1-5, 2-16, 3-16, 4-39, 5-83. **బౌలింగ్:** స్టార్క్ 9.5-0- 49-3, స్టొయినిస్ 7-1-27-2, అబాట్ 9-0-31-0, గ్రీన్ 6-0-35-0, జంపా 6-0-37-0, మ్యాక్స్‌వెల్ 2-0-7-0.



గాయత్రి-ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్


బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి - ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21-14, 18-21, 21-12 స్కోరుతో లీ వెన్ మీ - ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి - ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి - ట్రెసా 6-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6-6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11-8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18-12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి - ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8-1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11-4..13-5..15-8..18-10...ఇలా సాగింది. 20-12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా - లీ సొ హితో గాయత్రి - ట్రెసా తలపడతారు.



జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా ఎన్ యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5-0 స్కోరుతో ఎంవాంగీ టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0-5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.



ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.